# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 22 అక్టోబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## బీఆర్ఎస్ స్టార్ క్యాంపెయినర్ల జాబితా విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక ప్రచారం కోసం బీఆర్ఎస్ తరపున 40 మంది స్టార్ క్యాంపెయినర్ల జాబితాను తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) కార్యాలయం ఆమోదించింది. బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ సోమ భరత్‌కుమార్ సమర్పించిన ప్రతిపాదన మేరకు ఈ జాబితాకు అనుమతి లభించింది. వీరికి ఎన్నికల ప్రచార వాహనాల కోసం పాస్‌లను కూడా మంజూరు చేశారు. ప్రచార కాలం అక్టోబర్ 18 నుంచి నవంబర్ 9 సాయంత్రం 6 గంటల వరకు కొనసాగనుంది.మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు (కేసీఆర్) పేరుతోపాటు పలు అగ్రనేతలు ఈ జాబితాలో ఉన్నారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, టీ.శ్రీనివాస్ యాదవ్, వీ. ప్రశాంత్‌రెడ్డి, జీ. జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, సబితా ఇంద్రారెడ్డి, ఎస్.నిరంజన్‌రెడ్డిలతో పాటు మహమూద్ అలీ, ఎర్రబెల్లి దయాకర్‌రావు, వీ.శ్రీనివాస్ గౌడ్, కొప్పుల ఈశ్వర్ పేర్లు కూడా ఉన్నాయి.మాజీ డిప్యూటీ స్పీకర్లు టీ.పద్మారావు గౌడ్, పద్మా దేవేందర్‌రెడ్డితో పాటు ప్రస్తుత ఎమ్మెల్యేలు ఎం.కృష్ణరావు, కేపీ.వివేకానంద్ గౌడ్, డీ.సుధీర్‌రెడ్డి, డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కాలేరు వెంకటేశం, పాడి కౌశిక్‌రెడ్డి, చామకూర మల్లారెడ్డి, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, అనిల్ జాదవ్, బండారు లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, చింతా ప్రభాకర్ పేర్లు ఉన్నాయి.

### అజ్ఞాత నాయకులు

# జన జీవన స్రవంతిలో కలవాలి

## మావోయిస్టులకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపు

- 'పోలీస్ అంటే సమాజానికి ఒక నమ్మకం, భరోసా.
- ఫ్రెండ్లీ పోలీసింగ్ చట్టాన్ని గౌరవించే పౌరులకు మాత్రమే
- తెలంగాణ పోలీస్ శాఖ దేశంలో అగ్రస్థానంలో కొనసాగాలి
- వీరమరణం పొందిన పోలీసు కుటుంబాలకు రాయితీలు, ఉద్యోగాలు, వసతి స్థలం, ఉచిత విద్య, వైద్యం
- పోలీసు అమరుల కోసం అత్యధిక నష్టపరిహారం రూ. 1 కోటి నుండి 2 కోట్లు
- ప్రాణాలు కోల్పోయిన కానిస్టేబుల్ కుటుంబానికి అండగా రూ.1 కోటి, ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి స్థలం
- ఇండియా జస్టిస్ రిపోర్ట్ 2025లో తెలంగాణ పోలీస్ శాఖకు ప్రథమ స్థానం
- పోలీసు పట్ల నమ్మకం పెంపొందించేందుకు: పారదర్శకత, జవాబుదారీతనం, నైతిక విలువల ప్రోత్సాహం
- గోషామహల్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ సభలో సీఎం రేవంత్‌రెడ్డి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

వామపక్ష తీవ్రవాద భావజాల ఉద్యమాల్లో ఉన్న అజ్ఞాత నాయకులు జన జీవన స్రవంతిలో కలిసి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే చట్టాన్ని గౌరవించే పౌరుల కోసమే తప్ప, చట్టాన్ని ఉల్లంఘించే వారికి కాదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజల భద్రత, శాంతిని పరిరక్షిస్తూ తెలంగాణ పోలీస్ శాఖ దేశంలోనే అగ్రస్థానంలో కొనసాగాలని ఆకాంక్షించారు. "పోలీసు అమరవీరుల సంస్మరణ దినం" సందర్భంగా రాష్ట్ర పోలీసు శాఖ గోషామహల్‌లో నిర్వహించిన పోలీస్ ఫ్లాగ్ డే పరేడ్‌లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమర వీరులను స్మరిస్తూ వారికి శ్రద్ధాంజలి ఘటించారు.విధి నిర్వహణలో అమరులైన పోలీసు కుటుంబాల సభ్యులను పరామర్శించారు. శాంతి భద్రతల పరిరక్షణలో తెలంగాణ పోలీసులు దేశానికి ఆదర్శంగా నిలిచారని అభినందించారు.

ముఖ్యమంత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ, విధి నిర్వహణలో పోలీసులు ఎదుర్కొంటున్న సవాళ్లు, పోలీసు సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వివరించారు. ఇటీవలి కాలంలో కొందరు కీలక మావోయిస్టు నాయకులు లొంగిపోయిన అంశాన్ని ప్రస్తావిస్తూ మిగిలిన మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలని కోరారు.

"పోలీస్ అంటే సమాజానికి ఒక నమ్మకం, భరోసా. విధి నిర్వహణలో ఒక్కోసారి ప్రాణాలను సైతం ఫణంగా పెట్టాల్సి వచ్చినా వెనుకడుగు వేయరు. నెత్తురు చిందుతున్నా మన రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన వీరులు ఎందరో ఉన్నారు. విధి నిర్వహణలో దేశం కోసం ప్రాణాలర్పించిన ఎందరో పోలీసు అమర వీరులను స్మరించుకోవడం మనందరి కర్తవ్యం.పోలీసు ఉద్యోగం కత్తి మీద సాము వంటిదే. పోలీసులకు ప్రతి క్షణం పరీక్షే, ప్రతి దినం పోరాటమే. ఒకవైపు నేరాల అదుపు, మరోవైపు నేరాల విచారణ, ట్రాఫిక్ నియంత్రణ, పగటి గస్తీ, రాత్రి గస్తీ, బందోబస్తు, వీఐపీల రక్షణ.. ఇలా సవాలక్ష బాధ్యతలతో విరామం లేకుండా పని చేస్తూ మనమందరం ప్రశాంతంగా జీవించేందుకు తమ జీవితాలను త్యాగం చేస్తున్నారు.

మన ప్రాణానికి వారి ప్రాణాలను అడ్డుపెట్టే పోలీసుల రుణం ఏమిచ్చినా తీరదు. సమాజ శ్రేయస్సే ఊపిరిగా విధులు నిర్వర్తిస్తున్న పోలీసులకు అండగా నిలవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. మా ప్రభుత్వం పోలీసుల సంక్షేమం కోసం అనేక చర్యలను చేపట్టింది. అధికారంలోకి వచ్చిన తర్వాత దాదాపు 16 వేల మంది కానిస్టేబుల్స్, ఎస్ఐలను రిక్రూట్ చేశాం. సంఘ విద్రోహ శక్తులు, తీవ్రవాదులు, ఉగ్రవాదుల దాడుల్లో వీరమరణం పొందిన లేదా గాయపడి, అంగవైకల్యం పొందిన పోలీసు అధికారులు, సిబ్బందికి, దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలో అత్యధిక నష్టపరిహారం అందించాం.విధి నిర్వహణలో వీరమరణం పొందిన పోలీసు కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి స్థలం, వారి పిల్లలకు రెసిడెన్షియల్ స్కూళ్లల్లో ఉచిత విద్య, వైద్యం, బస్ పాస్ సౌకర్యం తదితర పథకాలను అందజేస్తున్నాం. మెడికల్ సీట్లలోను పోలీస్ అమరుల పిల్లలకు ప్రత్యేకంగా సీట్లను కేటాయిస్తున్నాం.

తీవ్రవాదుల, ఉగ్రవాదుల హింసలో చనిపోయిన వారికి అందించే ఎక్స్‌గ్రేషియాను కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐల వరకు కోటి రూపాయలను, ఎస్సై సీఐలకు కోటి 25 లక్షల రూపాయలను, డీఎస్పీ, అడిషనల్ ఎస్పీలకు కోటి 50 లక్షల రూపాయలను, ఎస్పీలకు ఇతర ఐపీఎస్ అధికారులకు 2 కోట్ల రూపాయలకు పెంచుతూ మా ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది.ఈ సంవత్సరం దేశ వ్యాప్తంగా 191 మంది పోలీసు సిబ్బంది, తెలంగాణలో ఆరుగురు పోలీసులు విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించారు. 3 రోజుల కింద నిజామాబాద్ లో సీసీఎస్ కానిస్టేబుల్ ఎంపల్లి ప్రమోద్ కుమార్ విధి నిర్వహణలో వీర మరణం చెందారు.భర్త ప్రమోద్‌ను పోగొట్టుకున్న అతని భార్య ప్రణీతకు, అతి చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయిన అతని ముగ్గురు కుమారులకు, వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది. 1 కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా, అమరుడైన కానిస్టేబుల్ పదవీ విరమణ వరకు లాస్ట్ పే డ్రాన్ వేతనంతో పాటు కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, 300 గజాల ఇంటి స్థలం మంజూరు చేస్తున్నాం.వీటితోపాటు పోలీస్ భద్రత సంక్షేమం నుండి 16 లక్షల ఎక్స్ గ్రేషియా, పోలీస్ సంక్షేమం నుండి 8 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియాను ప్రమోద్ కుటుంబానికి చెల్లించి వారి కుటుంబానికి అండగా ఉంటాం.

ఇండియా జస్టిస్ రిపోర్ట్ 2025 ప్రకారం, దేశంలోనే తెలంగాణ పోలీస్ శాఖకు ప్రథమ స్థానం లభించింది. అలాగే, పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ విధానంలోనూ విదేశాంగ శాఖ నుంచి ప్రత్యేక అభినందనలు పొందింది. ఈ విజయాలు తెలంగాణ పోలీస్ సిబ్బంది నిరంతర కృషి, అంకితభావానికి నిదర్శనం. తెలంగాణ పోలీసు అకాడమీ, జైళ్ల శాఖ, ఎస్ఐబీ, ఏసీబీ, సీఐడీ, విజిలెన్స్, ఆర్మ్‌డ్ రిజర్వ్, సీసీఎస్, సైబర్ సెక్యూరిటీ బ్యూరోలకు మహిళా ఐపీఎస్‌ల సారథ్యం వహించడం మా ప్రభుత్వానికి గర్వకారణం. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ ఈ కీలక పోలీసు కమిషనరేట్లలో జోన్ డీసీపీలుగా ఏడుగురు మహిళా అధికారులే.ఆ బాధ్యతతోనే పోలీసు సిబ్బంది పిల్లలకు ప్రత్యేక విద్యా సంస్థలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చాం. అందులో భాగంగా పోలీసుల పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో నాణ్యమైన విద్యను అందించే ఉద్దేశంతో రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ప్రారంభించాం.పోలీస్ శాఖ ఇదే పనితీరును కొనసాగిస్తూ దేశంలోనే అగ్రస్థానంలో నిలవాలని కోరుకుంటున్నాను. పారదర్శకత, జవాబుదారీతనం, నైతిక విలువలు పాటించడం పోలీసింగ్ కు మూల స్థంభాలు. ఇవే సమాజాన్ని పోలీసులకు దగ్గరికి చేయడంతోపాటు పోలీస్ శాఖపై నమ్మకాన్ని పెంపొందిస్తాయి. సమాజానికి దగ్గరగా ఉండే పోలీసింగ్ మోడల్‌ను అనుసరించాలి.." అని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి, ఆయా విభాగాలకు చెందిన ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పోలీసు సురక్ష రూపొందించిన "అమరులువారు" పుస్తకాన్ని ఆవిష్కరించారు.

## ఆపరేషన్ సింధూర్‌కు శ్రీ రాముడే స్ఫూర్తి



- పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకున్నాం
- అయోధ్య రామాలయ నిర్మాణం తర్వాత రెండవ దీపావళి ప్రత్యేకతగా నిలిచింది
- మావోయిస్టుల నుంచి విముక్తి పొందిన ప్రాంతాల్లో ప్రజలు సాధారణ జీవితానికి చేరుకుంటున్నారు
- స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలి
- అన్ని భాషలను గౌరవించాలి
- దేశ ప్రజలకు ప్రధాని మోడీ లేఖ

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

ఆపరేషన్ సింధూర్‌కు శ్రీరాముడే స్ఫూర్తి అని ప్రధాని మోడీ తెలిపారు. దేశ ప్రజలకు ప్రధాని మోడీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. దీపావళిని శక్తి , ఉత్సాహంతో నిండిన పండుగగా అభివర్ణించారు. ఈ క్రమంలో దేశప్రజలకు బహిరంగ లేఖ రాశారు. ఈ లేఖలో ఆయన దేశభక్తి, సామాజిక ఐక్యత మరియు గత కొన్ని నెలల ప్రభుత్వ చర్యల ప్రధానార్థాలను తీరిగ్గా సూచించారు.

ప్రధాని లేఖలో ముఖ్యంగా ఆపరేషన్ సింధూర్‌కు పత్యేక స్థానాన్ని ఇచ్చారు. శ్రీరాముడే ఆ ఆపరేషన్‌కు స్ఫూర్తి ఇచ్చిందని, ఆపరేషన్ ద్వారా భారత ధర్మాన్ని కాపాడటం మాత్రమే కాకుండా పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చినట్టు తెలిపారు. అయోధ్యలో రామాలయ నిర్మాణం తరవాత ఇదే రీతిలో జరిపిన మరో దీపావళిగా ఈ సంవత్సరం ఎంతో ప్రత్యేకమన్నారు. "శాంతి, ధర్మం ను కాపాడాలని శ్రీరాముడు మనకు బోధించాడు. అన్యాయం ఎదుర్కొనే ధైర్యాన్ని ఆయన నిర్మించినట్లు మనం చరిత్రలో ఎన్నో ఉదాహరణలతో చూస్తున్నాం. కొన్ని నెలల క్రితం ప్రారంభించిన ఆపరేషన్ సింధూర్ యే ఇందుకు ఉదాహరణ. మనం భారత ధర్మాన్ని రక్షించటం సాటే, ఉగ్రదాడికి సముచిత ప్రతీకారం కూడా తీర్చాం." మావోయిస్టుల బంధనాల నుంచి విముక్తి పొందిన జిల్లాలు, మారుమూల ప్రాంతాల్లో కూడా దీపావళి వేళలు వెలిగినదని ప్రస్తావిస్తూ హింసా మార్గాన్ని విడిచి పలువురు ప్రజలు సాధారణ జన జీవన స్రవంతి లోకి చేరుతున్నారని ఇది దేశానికి విశేష విజయం అని పేర్కొన్నారు.

ఆర్థిక సంక్షేత్రానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇటీవల చేసిన జీఎస్టీ రేటు తగ్గింపును కూడా ప్రస్తావించి, దీని వల్ల ప్రజలకు సంపూర్ణంగా లాభమవుతుందని, స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించమని పౌరులను పిలుపునిచ్చారు. అన్ని భాషలను గౌరవించమని, భాషా వైవిధ్యాన్ని దేశ భావనగా అభివృద్ధి చేసుకోవాలని కోరారు. ప్రతి పౌరుడు పరిశుభ్రత పాటించవలెనని, స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇవ్వాలని అభ్యర్థించారు.

ఆహారంలో నూనె వినియోగాన్ని 10 శాతం తగ్గించమని, అది ఆరోగ్యానికి మేలు చేస్తుందని, ఆరోగ్యకర జీవనశైలికి ప్రమాణంగా యోగాను ఆచరణలో పెట్టాలని సూచించారు. ఇవే లక్ష్యాలు కలిసి వికసిత్ భారత్ దిశగా దేశాన్ని నడిపిస్తాయని ఆయన విశ్వసించారు. ప్రధాని ఎక్కడైనా రాష్ట్ర, ప్రాంత, భక్తి-సాంస్కృతిక సందర్భాలను గమనిస్తూ, సమగ్ర అభివృద్ధి కోసం పౌర సంప్రదాయాలు, ఆరోగ్యం, ఆర్థిక స్థిరత్వం అన్నిటిని సమన్వయంగా తీసుకొని ముందుకు సాగాలని లేఖలో సూచించారు.

## కానిస్టేబుల్ హత్య కేసు నిందితుడు ఎన్‌కౌంటర్

- ఆస్పత్రిలో ఏఆర్ కానిస్టేబుల్ నుంచి గన్ లాక్కొని ఫైర్ చేసే యత్నం
- ఆత్మరక్షణలో భాగంగానే కాల్పులు చేసినట్టు సీపీ ప్రకటన





**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

నిజామాబాద్ సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ హత్య కేసు నిందితుడు షేక్ రియాజ్ పోలీసు కాల్పుల్లో మృతి చెందాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రియాజ్ సోమవారం ఉదయం కానిస్టేబుల్ వద్ద తుపాకీ లాక్కొని ట్రిగ్గర్ నొక్కే ప్రయత్నం చేశాడు. పోలీసులు తుపాకీ కింద పడేయమని హెచ్చరించినా వినకపోవడంతో ఆర్ఐ కాల్పులు జరిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీపీ సాయిచైతన్య తెలిపారు.

రియాజ్ మృతిపై కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. అతడు పోలీసుల చేతిలో హతమవ్వడంతో స్థానికులు కూడా సంబురాలు జరుపుకున్నారు. ఈ నెల 17న రాత్రి ఓ చోరీ కేసులో అదుపులో ఉన్న రియాజ్ కానిస్టేబుల్ ప్రమోద్‌పై కత్తితో దాడి చేసి చంపాడు. దాడి అనంతరం ఆ రాత్రంతా ఐదు, ఆరు పోలీస్ స్టేషన్‌ల పరిధిలో తిరుగుతూ పోలీసులకు తప్పించుకున్నాడు. నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులు తొమ్మిది బృందాలుగా విడిపోయి గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం ఉదయం సారంగాపూర్ శివారులో పాత లారీ క్యాబిన్‌లో దాక్కొని ఉన్న రియాజ్‌ను గుర్తించారు. పోలీసులు పట్టుకునే ప్రయత్నంలో అతడు ఆసిఫ్ అనే వ్యక్తిపై కత్తితో దాడి చేసి ఎడమచేతిని గాయపరిచాడు. అప్రమత్తమైన పోలీసులు రియాజ్‌ను చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు.

గాయాలతో బాధపడుతున్న రియాజ్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న రియాజ్ సోమవారం ఉదయం పహారా కాస్తున్న కానిస్టేబుల్ దగ్గర తుపాకీ లాక్కొని కాల్పులు జరపబోయాడు. పోలీసులు హెచ్చరించినా వినకపోవడంతో, గత్యంతరం లేని పరిస్థితుల్లో కాల్పులు జరపగా రియాజ్ మృతి చెందాడు.రియాజ్ దాడికి తెగబడ్డాడని, పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి కాల్పులు జరపాల్సి వచ్చిందని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు కట్టుబడి ఉన్నారని చెప్పారు.

"ప్రమోద్ కుటుంబానికి రూ. కోటి పరిహారం, 300 గజాల స్థలం, వెల్ఫేర్ బోర్డు నుండి రూ. 24 లక్షల సాయం, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తాం" అని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు.

**రియాజ్‌పై 61 కేసులు**

రియాజ్‌పై నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, నిర్మల్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో గత ఐదేళ్లలో 61 కేసులు నమోదయ్యాయి. బైకులు, బుల్లెట్లు దొంగిలించి ఇంజిన్ నంబర్లు మార్చి మహారాష్ట్రలో అమ్మడంలో అతడు నిపుణుడు. మూడుసార్లు జైలు శిక్ష అనుభవించినప్పటికీ, నేరపంథా మార్చుకోలేదు.

## ఫార్మసీ కోర్సుల్లో 10,595 మందికి సీట్ల కేటాయింపు

- రేపటి వరకు కాలేజీల్లో చేరేందుకు గడువు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి బీ ఫార్మసీ, ఫార్మా-డీ, బయోటెక్నాలజీ, బయోమెడికల్ ఇంజినీరింగ్, ఫార్మాసూటికల్ సైన్స్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎప్‌సెట్ బైపీసీ విద్యార్థుల కౌన్సెలింగ్ ప్రక్రియలో సాంకేతిక విద్యాశాఖ సీట్లు కేటాయించింది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎప్‌సెట్ ప్రవేశాల కన్వీనర్ శ్రీదేవసేన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఎప్‌సెట్‌లో 71,309 మంది అభ్యర్థులు ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. వారిలో ధ్రువపత్రాల పరిశీలనకు 16,336 మంది హాజరయ్యారని వివరించారు. 15,192 మంది వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని పేర్కొన్నారు. ఫార్మసీ కోర్సుల్లో 10,960 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తుది విడతలో 10,595 (96.67 శాతం) మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. ఇంకా 365 (3.33 శాతం) సీట్లు మిగిలిపోయాయని వివరించారు. 124 బీ ఫార్మసీ కాలేజీల్లో 8,908 సీట్లుంటే, 8,175 మందికి సీట్లు కేటాయించామనీ, 348 సీట్లు మిగిలాయని తెలిపారు. 74 ఫార్మాడీ కాలేజీల్లో 1,682 సీట్లుండగా, 1,671 మందికి సీట్లు కేటాయించామనీ, 11 సీట్లు మిగిలిపోయాయని పేర్కొన్నారు. రెండు బయోమెడికల్ ఇంజినీరింగ్ కాలేజీల్లో 49 సీట్లుంటే, అందరికీ సీట్లు కేటాయించామని వివరించారు. మూడు ఫార్మాసూటికల్ ఇంజినీరింగ్ కాలేజీల్లో 116 సీట్లుండగా, 110 మందికి సీట్లు కేటాయించామనీ, ఇంకా ఆరు సీట్లు మిగిలాయని తెలిపారు. ఐదు బయోటెక్నాలజీ కాలేజీల్లో 205 సీట్లుంటే, అందరికీ సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేసేందుకు గడువు బుధవారం వరకు ఉందని తెలిపారు. కేటాయించిన కాలేజీల్లో రిపోర్టు చేసేందుకు గడువు ఈనెల 23 వరకు ఉందని పేర్కొన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలను కాలేజీల్లో సమర్పించాలని సూచించారు. ఇతర వివరాల కోసం https://tgeapcetb.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

## 317 జిన్నింగ్ మిల్లులకు గుర్తింపు





- రైతుల సమస్యల పరిష్కారం కోసం టోల్-ఫ్రీ నెంబర్ 1800 599 5779
- పప్పుదినుసుల వంగడాల పంపిణీలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయనీ, రాష్ట్ర వ్యాప్తంగా 317 జిన్నింగ్ మిల్లులు గుర్తించామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఖమ్మంలో, 24న నల్లగొండలో సీసీఐ కేంద్రాలు ప్రారంభమవుతాయన్నారు. మిగతా జిల్లాల్లోనూ త్వరగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1800 599 5779 ఏర్పాటు చేశామనీ, ఆ నెంబర్ ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. 24 గంటల్లో సమస్యను పరిష్కరించేందుకు ఒక సీనియర్ అధికారిని నియమించామన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రైతులకు మేలైన పప్పుదినుసుల వంగడాలు కుసుమ, పొద్దుతిరుగుడు విత్తనాలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతున్నదని చెప్పారు. గత సీజన్‌లో ప్రతి జిల్లాలోనూ ఎంపిక చేసిన ఒక మండలంలో 1,39,000 మట్టి నమూనాలు సేకరించి, వాటి విశ్లేషణ పూర్తి చేసి ఫలితాలు రైతులకు అందజేశామనీ, త్వరలో ఇంకో 1,70,000 మట్టి నమూనా ఫలితాలు అందుతాయని వివరించారు. నేచురల్ ఫార్మింగ్‌కు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదనీ, ఇప్పటికే క్లస్టర్లను గుర్తించి శిక్షణ కూడా పూర్తిచేశామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలతో అమలయ్యే పథకాలన్నింటికీ పునరుద్ధరిస్తూ పోతున్నామని చెప్పారు. గత రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వాటా విడుదల చేయకపోవడంతో రూ.3 వేల కోట్ల మేర రైతులు నష్టపోయారని వాపోయారు. వరితో పాటు పప్పుదినుసులు, నూనె గింజల సాగును కూడా పెంచే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఈ పథకంలో భాగంగా ఈ యాసంగిలో రూ.2.68 కోట్ల సబ్సిడీతో 49,397 ఎకరాలకు సరిపడా 5825 క్వింటాళ్ల శనగ విత్తనాలు 14 జిల్లాలలో పంపిణీకి వ్యవసాయశాఖ ఏర్పాట్లు చేసిందని వివరించారు.

## బస్తీ దవాఖానాలపై ప్రభుత్వం నిర్లక్ష్యం

- ఏఐసీసీ అంటే.. ఆల్ ఇండియా కరప్షన్ కమిటీ
- సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్
- బస్తీ దవఖానను సందర్శించిన కేటీఆర్



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

బస్తీ దవాఖానాలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం సరిదిద్దుకోకపోతే త్వరలోనే ప్రతి బస్తీ దవాఖాన ముందు వెయ్యి మంది చొప్పున ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. హైదరాబాద్ ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఇబ్రహీంనగర్‌లో బస్తీ దవాఖానను ఆయన మంగళవారం సందర్శించారు. మందులు, పరికరాల పని తీరు, దవాఖానలో అందుతున్న వైద్య సేవల వివరాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అలాగే గురుబ్రహ్మ నగర్‌లోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు చాక్లెట్లు పంపిణీ చేశారు.అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో 450 బస్తీ దవాఖానాలు, తెలంగాణ డయాగ్నస్టిక్స్ సెంటర్లు ఏర్పాటు చేసినట్టు గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ దవాఖానలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. బస్తీ దవాఖానాలను నిర్లక్ష్యం చేసి, ప్రజారోగ్యాన్ని పూర్తిగా పక్కన పెట్టేశారన్నారు. నాలుగు, ఐదు నెలలుగా సిబ్బందికి వేతనాలు ఇవ్వడం లేదని, దవఖానాల్లో మందులు అందుబాటులో లేవని తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ప్రజారోగ్యంపై చింతే లేదని ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో హైదరాబాద్ నాలుగు వైపులా టిమ్స్ దవాఖానలను ప్రారంభించామని, వాటిలో 90 శాతం పనులు పూర్తయ్యాయని కేటీఆర్ తెలిపారు. మిగిలిన 10 శాతం పనులు చేయడానికి ఈ ప్రభుత్వానికి చేతకావడం లేదని మండిపడ్డారు. హైదరాబాద్‌ను రేవంత్ గాలికి వదిలేశారని చెప్పారు. ప్రజల ఆరోగ్యం మీద ప్రభుత్వం దష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

ఏఐసీసీ అంటే.. ఆల్ ఇండియా కరప్షన్ కమిటీ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీలో గెలిచిన వాళ్లను తీసుకుని వాళ్ల పార్టీ క్యాంపెయినర్ల జాబితాలో పెట్టారని మండిపడ్డారు. దానం నాగేందర్ పేరు కాంగ్రెస్ పార్టీ క్యాంపెయినర్ల లిస్టులో ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. ఆయన ఏ పార్టీలో గెలిచారు, ఏ పార్టీకి ప్రచారం చేస్తున్నాడని నిలదీశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేకపోతున్నారని, వాళ్ళకి సిగ్గనిపిస్తలేదా అని ప్రశ్నించారు. స్పీకర్ దగ్గర వారు పార్టీ మారలేదని అబద్దాలు చెబుతున్నారని ధ్వజమెత్తారు.

## జూబ్లీహిల్స్ ఎన్నికల్లో పార్టీలు నిబంధనలు పాటించాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నిలో పోటీలో ఉన్న రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల సంఘం నిబంధనలు విధిగా పాటించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సభల అనుమతి, ప్రచారం వ్యయాలను సమర్పించాలని సూచిం చారు. పోలింగ్ రోజు లేదా దానికి ముందురోజు పత్రికల్లో రాజకీయ ప్రకటనలు ప్రచురించడానికి తప్పనిసరిగా మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, మీడియా సంస్థలు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని ఆయన సూచించారు. ఓటర్లను ప్రభావితం చేసే తప్పుడు, మభ్యపెట్టే లేదా నిర్ధారణ లేని ప్రకటనలను ప్రచారం చేయరాదన్నారు. ప్రకటనలను ప్రచురించే ముందు కనీసం రెండు రోజుల ముందుగానే ఎంసీఎంసీకి దరఖాస్తు చేయాలనీ, తద్వారా సమీక్షకు తగిన సమయం లభిస్తుందని వివరించారు. రాష్ట్ర, జిల్లా స్థాయి ఎంసీఎంసీ కమిటీలు ఇప్పటికే క్రియాశీలంగా పనిచేస్తున్నాయని ఆయన తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లో ఉందనీ, ప్రచారం, వ్యయం, ప్రకటనల విషయంలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటించాలని సూచించారు. ఉల్లంఘన జరిగితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్వేచ్ఛగా, ప్రశాంతంగా పోలింగ్ జరిగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని సుధర్షన్ రెడ్డి పేర్కొన్నారు.

## ముగిసిన నామినేషన్ల పర్వం

- చివరి రోజు భారీగా నామినేషన్లు
- దాటిన 287 నామినేషన్లు
- బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి నామినేషన్





**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు నామినేషన్ల గడువు మంగళవారంతో ముగిసింది. చివరి రోజు భారీగా నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నెల 18వ తేదీ వరకు 94 మంది 127 నామినేషన్లు దాఖలు చేశారు. 19, 20 తేదీల్లో సెలవు కాగా మంగళవారం నామినేషన్లను స్వీకరించారు. ఈ మేరకు బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి నామినేషన్ వేశారు. అలాగే ఈ ఒక్కరోజే 160కుపైగా అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారు. దాంతో ఇప్పటి వరకు 287కు పైగా నామినేషన్లు దాఖలయ్యాయి. ఆర్ఆర్ఆర్ బాధిత రైతులు, ఓయూ నిరుద్యోగ వికాస నాయకులు నామినేషన్లు దాఖలు చేశారు.

మంగళవారం నామినేషన్లకు చివరి రోజు కావడంతో పోటీ చేయాలనుకుంటున్న అభ్యర్థులు భారీగా తరలివచ్చారు. రీజినల్ రింగ్ రోడ్ లో భూములు కోల్పోతున్న బాధిత రైతుకు పెద్ద సంఖ్యలో వచ్చారు. మధ్యాహ్నం మూడు గంటలకే నామినేషన్ల గడువు సమయం పూర్తయినప్పటికీ అప్పటికే నామినేషన్లు వేయడానికి కార్యాలయానికి వచ్చి క్యూలైన్లలో ఉన్న వారందరి నామినేషన్ల దాఖలు పూర్తి అయ్యేవరకు ప్రక్రియ కొనసాగించాలని అధికారులు ఆదేశించారు. దాంతో రాత్రి వరకు నామినేషన్ల పర్వం కొనసాగింది. నామినేషన్లను 22న(నేడు) పరిశీలించనున్నారు. నామినేషన్ల ఉపసంహరణకు 24 చివరి తేదీ. నవంబర్ 11న పోలింగ్ జరగనుండగా, ఓట్ల లెక్కింపు నవంబర్ 14న చేపట్టనున్నారు.

## బస్తీ దవాఖానాలకు సుస్తీ పట్టింది

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు
- శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని బస్తీ దవాఖాన సందర్శన


వివరాలు 4వ పేజీలో



## జూబ్లీహిల్స్‌లో అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్‌ను గెలిపించండి

- మంత్రి సీతక్క

**బలగం టీవీ, హైదరాబాద్**

జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలని మంత్రి సీతక్క ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో భాగంగా బోరబండలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ తరపున మంగళవారం మంత్రి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గత ప్రభుత్వం జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని విస్మరించిందని, సమస్యలతో నిండిపోయిందని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు ఒక అవకాశం ఇవ్వాలని ఓటర్లను అభ్యర్థించారు. ఆయనకు అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తారని తెలిపారు.

## బస్తీ దవాఖానాలకు సుస్తీ పట్టింది

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు

**బలగం టీవీ, హైదరాబాద్**



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజారోగ్యాన్ని పూర్తిగా పక్కన పెట్టిందని, బస్తీ దవాఖానాలు నిర్లక్ష్యం పాలవుతున్నాయని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని బస్తీ దవాఖానను మంగళవారం ఆయన సందర్శించారు. దవాఖానలో సదుపాయాలు, మందుల అందుబాటు, వైద్య పరికరాల పనితీరును పరిశీలించి, సిబ్బంది మరియు పేషెంట్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా సిబ్బంది తమకు నాలుగు నుంచి ఆరు నెలలుగా జీతాలు అందలేదని ఆయనకు వాపోయారు.

హరీశ్ రావు మాట్లాడుతూ "కాంగ్రెస్ పాలనలో బస్తీ దవాఖానాలకు సుస్తీ పట్టింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చెప్పేది ఒకటి, చేసేది మరోటి. కేసీఆర్ కిట్‌లను తీసేయడం వల్ల పేద మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజల ఆరోగ్యం పట్ల రేవంత్‌కు ఎలాంటి శ్రద్ధ లేదని ఇది స్పష్టమవుతోంది" అని వ్యాఖ్యానించారు. "కేసీఆర్ గారు పేదల గడప దగ్గరే వైద్యం అందించాలని ఉద్దేశ్యంతో రాష్ట్రవ్యాప్తంగా 450 బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేశారు. వాటిలో 110 రకాల మందులు ఉచితంగా ఇచ్చేవాళ్లం, 134 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించేవాళ్లం. కానీ 22 నెలల కాంగ్రెస్ పాలనలో ఆ దవాఖానాలన్నీ స్తబ్దుగా మారాయి." "సిబ్బందికి జీతాలు ఇవ్వని ప్రభుత్వం, మందుల సరఫరా చేయని ప్రభుత్వం పేదల ఆరోగ్యంపై మాట్లాడటానికి హక్కు లేదు. బిల్లులు పెండింగ్‌లో పెట్టి ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేస్తున్నారు. గ్రీన్ చానల్ మాటలకే పరిమితమైపోయింది" అని అన్నారు.

"రేవంత్ రెడ్డి కొత్త వైన్ షాపుల ఫీజులను రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచాడు. జనం ఆరోగ్యం కంటే మద్యం ఆదాయమే ముఖ్యం అయింది. ఒక్కరోజైనా బస్తీ దవాఖానాలపై రివ్యూ చేశావా?" అని ప్రశ్నించారు. "జూబ్లీహిల్స్ ప్రజలు కాంగ్రెస్ నిర్లక్ష్యానికి గట్టి బుద్ధి చెప్పాలి. ప్రజల ఓటుతోనే రేవంత్ ప్రభుత్వానికి మెలుకువ వస్తుంది" అని అన్నారు.



## శ్రీమల్లికార్జున టిఫిన్ సెంటర్ ప్రారంభోత్సవంలో హరీష్ రావు, రవిచంద్ర..

**బలగం టీవీ, సిద్ధిపేట**

బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాజీ మంత్రి, సిద్ధిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావుతో కలిసి చిన్న కోడూరు మండల కేంద్రంలో టిఫిన్ సెంటర్ ను ప్రారంభించారు. బీఆర్ఎస్ నాయకుడు గుండెల్లి వేణు యాదవ్ ఏర్పాటు చేసిన శ్రీమల్లికార్జున టిఫిన్, టీ సెంటర్ ను ఆదివారం మాజీ మంత్రి హరీష్ రావుతో కలిసి ఎంపీ రవిచంద్ర రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొని కొబ్బరికాయలు కొట్టారు. తన టిఫిన్ సెంటర్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన హరీష్ రావు, రవిచంద్ర, తెలంగాణ ఏస్సీ, ఏస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్యలకు వేణు యాదవ్ సాదర స్వాగతం పలికి కండువాలతో సత్కరించారు. టిఫిన్ సెంటర్ దినదినాభివృద్ధి చెందుతూ కస్టమర్ల ఆదరణ మరింతగా చూరగొనాలని ఆకాంక్షిస్తూ హరీష్ రావు, రవిచంద్రలు వేణు యాదవ్ కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారికి ఆశీస్సులు అందజేశారు.

# మహిళల పట్ల కాంగ్రెస్ వైఖరి దారుణం..

- రాష్ట్రంలో అరాచక పాలన,
- బీఆర్ఎస్ పార్టీ మహిళా నేతలు, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్

**బలగం టీవీ, హైదరాబాద్**




తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై, ముఖ్యంగా మహిళల పట్ల వైఖరిపై బీఆర్ఎస్ పార్టీ మహిళా నేతలు, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆదివారం రోజున తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని, శాంతిభద్రతలు పూర్తిగా గాడి తప్పాయని ఆందోళన వ్యక్తం చేశారు.

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. 'మిస్ వరల్డ్' పోటీల వ్యవహారంపై స్పష్టత లేకపోవడం, సీఎం సొంత నియోజకవర్గంలో మహిళా జర్నలిస్టులపై కేసులు పెట్టడం, నిండు సభలో మహిళా ఎమ్మెల్యేలను సీఎం అవమానించడం, తాజాగా మాగంటి సునీతపై మంత్రులు అనుచిత వ్యాఖ్యలు చేయడం వంటి ఘటనలు రాష్ట్రంలో మహిళల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ దారుణమైన వైఖరికి నిదర్శనమని అన్నారు. రాష్ట్రంలో గన్ కల్చర్ తెచ్చారని, క్యాబినెట్ మంత్రి ఇంటిపైకి అర్థరాత్రి పోలీసులు వెళ్లినా ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేయకపోవడం, నిందితుడిని మంత్రి కారులో తీసుకెళ్లినా కేసు పెట్టకపోవడంపై డీజీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం స్వయంగా గన్ ఇచ్చారని మంత్రి కూతురు ఆరోపణలు చేస్తే ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కాబినెట్ సమావేశంలో ఏ మంత్రి వాటా ఎంత అనే దానిపై చర్చిస్తున్నారని ఆరోపిస్తూ, గవర్నర్ జోక్యం చేసుకోవాలని కోరారు. సీఎంపైనే ఆరోపణలు, మంత్రులపై ఆరోపణల విషయంలో సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మంచిరేవుల భూముల వ్యవహారంలో సీఎం సోదరులపై ఆరోపణలు వస్తున్నాయని, అలాగే సిమెంట్ కంపెనీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. రాష్ట్రంలో ఇంత జరుగుతున్నా కేంద్ర మంత్రులు ఇద్దరు ఉండి, ముఖ్యంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ గన్ కల్చర్ పై విచారణకు ఎందుకు ఆదేశించడం లేదని బీజేపీ నేతల మౌనంపై విస్మయం వ్యక్తం చేశారు. నాడు కేసీఆర్ హయాంలో అన్ని వర్గాల అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు.

మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. సీఎం ఇంటి సమీపంలోనే గన్ తో బెదిరించే పరిస్థితి నెలకొందని, ఇది రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎంత అస్తవ్యస్తంగా ఉన్నాయో తెలియజేస్తోందని అన్నారు. మాగంటి సునీతపై మంత్రులు చేసిన వ్యాఖ్యలు దౌర్భాగ్యం అని, మంత్రి కూతురే సీఎంపై ఆరోపణలు చేస్తుంటే మీ పాలన ఎలా ఉందో ప్రజలకు అర్థమవుతుందని అన్నారు. హరీష్ రావు కాబినెట్ సమావేశంపై మాట్లాడితే మంత్రి సీతక్క తన తల్లిదండ్రులపై ఎందుకు ప్రమాణం చేయాలని ప్రశ్నించారు. మేడారం పనులు మాకు దక్కలేదని కాంగ్రెస్ నేతలు అనలేదా అని నిలదీశారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఏ ముఖంతో సంబరాలు చేసుకుంటారని ప్రశ్నించారు. సీఎం నియోజకవర్గం కలెక్టరేట్ లో మహిళా ఉద్యోగి పట్ల లైంగిక వేధింపులపై ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని పేర్కొన్నారు.

## కుప్పకూలే స్థితిలో బస్తీ దవాఖానాలు : బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో బస్తీ దవాఖానాల పరిస్థితి దయనీయంగా మారిందని, ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని బీఆర్ఎస్ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ దూరదృష్టితో ప్రారంభించిన బస్తీ దవాఖానాలు ఇప్పుడు కుప్పకూలే స్థితికి చేరుకున్నాయని వారు పేర్కొన్నారు.

యూసుఫ్‌గూడ బస్తీ దవాఖానను బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గోపినాథ్ కలిసి పరిశీలించారు. వైద్య సదుపాయాలు, మందుల సరఫరా, పేషెంట్లకు అందుతున్న సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ముషీరాబాద్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని బస్తీ దవాఖనలో ఎంఎల్ఎ ముఠా గోపాల్ ఆకస్మిక తనిఖీ చేసి, రోగులతో మాట్లాడి సమస్యలను విచారించారు.

రహమత్‌నగర్ డివిజన్‌లోని కార్మికనగర్ బస్తీ దవాఖానను మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, ఎంఎల్‌సీ తక్కెలపల్లి రవీందర్‌రావు సందర్శించారు. రోగులు పడుతున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా విని, అవసరమైన చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను సూచించారు. ఎర్రగడ్డ డివిజన్‌లోని సుల్తాన్‌నగర్ బస్తీ దవాఖానను ఎంఎల్ఎ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. సిబ్బంది, పేషెంట్లతో మాట్లాడి వైద్య సేవల లోపాలను తెలుసుకున్నారు. సికింద్రాబాద్ రసూల్‌పుర్ బస్తీ దవాఖానలో వసతులను బీఆర్ఎస్ నేత క్రిశాంక్ తనిఖీ చేశారు. అక్కడి రోగులు మందుల కొరత, పరికరాల పని చేయకపోవడంపై తమ సమస్యలను వెల్లడించారు.

అంబర్‌పేట గంగానగర్ బస్తీ దవాఖనలో ఎంఎల్ఎ కాలేరు వెంకటేష్, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ప్రేమ్‌నగర్ బస్తీ దవాఖనలో ఎంఎల్‌సీ వంటేరు యాదవ్‌రెడ్డి, ఎంఎల్ఎ సునీత లక్ష్మారెడ్డి తనిఖీలు నిర్వహించారు. షేక్‌పేట్ బస్తీ దవాఖనలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఎంఎల్‌సీ డాసోజు శ్రవణ్ పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "కేసీఆర్ ఎంతో ముందు చూపుతో ప్రారంభించిన బస్తీ దవాఖానాలు ఇప్పుడు నిర్లక్ష్యంతో కుప్పకూలే పరిస్థితి దాపురించాయి. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని చర్యలు తీసుకోకపోతే, బీఆర్ఎస్ పార్టీ ప్రత్యేక కార్యాచరణ చేపడుతుంది," అని హెచ్చరించారు.

## 'వసూళ్ల దర్బార్ నడిపిస్తున్న సీఎం రేవంత్'

**బలగం టీవీ, హైదరాబాద్**




తెలంగాణ భవన్‌లో అసెంబ్లీ బీఆర్ఎస్ విప్ కె.పి.వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

కేసీఆర్ తెలంగాణను అగ్రగామిగా నిలిపారని, హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతలను కాపాడి, ఏడు లక్షలకు పైగా ప్రైవేటు ఉద్యోగాలు కల్పించారని, మౌలిక వసతులు పెంచారని తెలిపారు. కేసీఆర్, కేటీఆర్ హయాంలో హైదరాబాద్ అంతర్జాతీయ నగరంగా గుర్తింపు పొందిందని, తలసరి ఆదాయంలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గన్‌లతో బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి, మంత్రులు వసూళ్ల కోసం పోటీ పడుతున్నారని, సీఎం రేవంత్ రెడ్డి వసూళ్లలో టాప్ 1 లో ఉన్నారని, ఆయన తన చుట్టూ తమ్ముళ్లను, చెంచాలను పెట్టుకున్నారని విమర్శించారు. కొండా సురేఖ ఉదంతం దీనికి ఉదాహరణ అని అన్నారు.

వసూళ్లలో రెండవ స్థానంలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మూడవ స్థానంలో డిప్యూటీ సీఎం భట్టి ఉన్నారని ఆరోపించారు. ఏ బిల్లుకు అయినా కమీషన్లు తీసుకుంటున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వసూళ్ళ దర్బార్ నడిపిస్తున్నారని, దొంగలాగా వచ్చి కమాండ్ కంట్రోల్ రూమ్‌లో కూర్చుంటున్నారని, సీఎం భయపడి సెక్రటేరియట్‌కు వెళ్లడం లేదని అన్నారు. రేవంత్ రెడ్డి వలన రాష్ట్రం పరువు పోతుందని వ్యాఖ్యానించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎం.ఐ.ఎం కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తుందని, అభ్యర్థిని పోటీ పెట్టడం లేదని తెలిపారు. 'కేసీఆర్ పాలన దేశానికి ఆదర్శం' అని గతంలో అసదుద్దీన్, అక్బరుద్దీన్ ఒవైసీ అన్న విషయాన్ని గుర్తు చేస్తూ, ఎం.ఐ.ఎం పార్టీ సిద్ధాంతం ఏంటో తెలియడం లేదని విమర్శించారు. 'ఆర్.ఎస్.ఎస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎలా మద్దతు ఇస్తున్నారని ముస్లింలు అసదుద్దీన్‌ను ప్రశ్నిస్తున్నారని' తెలిపారు. రేవంత్ రెడ్డి అసదుద్దీన్‌కు ఎన్నికల ముందు సైతాన్, ఎన్నికల తర్వాత భగవాన్ లా కనపడుతున్నారని ఎద్దేవా చేశారు. బోరబండను బంగారు బండగా మాగంటి గోపీనాథ్ మార్చారని, జూబ్లీహిల్స్ ప్రజలు ఆయన రుణం తీర్చుకుంటారని అన్నారు. నవీన్ యాదవ్ నామినేషన్ ర్యాలీ అట్టర్ ఫ్లాప్ అయిందని, హైదరాబాద్ నగరం బీఆర్ఎస్ పార్టీకి కంచుకోట అని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో అదానీని రానివ్వలేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అదానీకి రెడ్ కార్పెట్ వేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ ఉప ఎన్నికల స్పెషలిస్ట్ అని, ఉప ఎన్నికల ద్వారానే తెలంగాణ వచ్చిందని ఆయన పేర్కొన్నారు.

# పోలీసు అమరవీరుల ప్రాణ త్యాగాలు చిరస్మరణీయం..

- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే
- పోలీస్ అమరుల త్యాగాన్ని స్మరిస్తూ నివాళులు, వారి కుటుంబ సభ్యులకు జిల్లా ఎస్పీ పరామర్శ..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలోని చందుర్తి మండలం లింగంపెట గ్రామ శివారులో గల అమరవీరుల స్తూపం వద్ద పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం (ఫ్లాగ్ డే)ను ఘనంగా నిర్వహించి, అమరవీరుల కుటుంబ సభ్యులు,పోలీస్ అధికారులతో కలిసి నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అనంతరం సాయుధ పోలీసులు "శోక్ శస్త్" చేసి పోలీసు అమరవీరులకు పోలీసు అధికారులు, సిబ్బంది అమరవీరుల కుటుంబ సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించి గత ఏడాది నుండి ఇప్పటి వరకు దేశంలో విధి నిర్వహణలో మరణించిన 192 మంది పోలీస్ అమరవీరుల పేర్లను చదివి వినిపించారు.



ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకై ప్రాణత్యాగాలు చేసిన పోలీస్ అమరవీరులు ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిపోతారని ఎస్పీ తెలిపారు. జిల్లాలో అంతర్గత భద్రత పరిరక్షణ విధుల్లో 08 మందికి పైగా పోలీసులు అసువులు బాసారని, వారి త్యాగఫలం వల్లే గతం కంటే ప్రస్తుత పరిస్థితి మెరుగ్గా ఉందని, పోలీసుల త్యాగనిరతిని నిరంతరం మననం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అమరవీరులు అందించిన స్ఫూర్తితో ప్రజల భద్రత, రక్షణ చర్యల్లో భాగంగా శాంతి భద్రతల పరిరక్షణ కోసం ముందుకు సాగుతున్నామన్నారు. అమరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత అన్ని వర్గాల ప్రజలపై ఉందని, దేశ సరిహద్దుల్లోని ఆక్సాయ్ చిన్ ప్రాంతంలో పహార కాస్తున్న 10 మంది సిఆర్పిఎఫ్ పోలీసులను 1959లో ఇదే రోజున చైనా దేశానికి చెందిన సైనికులు హతమార్చారని, అప్పటినుండి వారి త్యాగాలను స్మరిస్తూ అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల దినం జరుపుకోవడం జరుగుతున్నదని పేర్కొన్నారు. విధి నిర్వహణ సందర్భంగా ఎన్నో జటిలమైన సవాళ్లు ఎదురవుతున్నా వాటిని అధిగమిస్తూ ముందుకు సాగుతున్నామని చెప్పారు.

ఇట్టి కార్యక్రమానికి హాజరైన అమరవీరుల కుటుంబాల సభ్యులతో మాట్లాడి వారి కుటుంబ పరిస్థుతులు వారి యొక్క సమస్యలను అడిగి వారు చెప్పిన సమస్యలను సాధ్యమైనంత తొందరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చి అమరవీరుల కుటుంబాలకు జ్ఞాపికలను అందించడం జరిగింది.పోలీస్ అమరవీరుల స్మరిస్తూ పోలీస్ వారి ఆధ్వర్యంలో ఈరోజు నుండి 31 తేదీ వరకు రక్తదాన శిబిరాలు, సైకిల్ ర్యాలీ, క్యాండిల్ ర్యాలీ, 2కే రన్, ఓపెన్ హౌస్, వ్యాసరచన పోటీలు, ఫోటో, వీడియో పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సి.ఐ లు వెంకటేశ్వర్లు, వీరప్రసాద్, శ్రీనివాస్, మొగిలి, శ్రీనివాస్, నటేష్, ఆర్.ఐ రమేష్, యాదగిరి, ఎస్.ఐ లు అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# రాజన్న ఆలయంలో శృంగేరి పీఠాధిపతి పూజలు..

- రాజ రాజేశ్వరుడికి అభిషేక పూజలు..
- కోడె మొక్కులు చెల్లింపు..
- ఆలయ విస్తరణ పనుల పరిశీలన..

**బలగం టీవీ, వేములవాడ**

ధర్మ విజయ యాత్రలో భాగంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని జగద్గురు శృంగేరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విధు శేఖర భారతి మహాస్వామి సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ఆలయంలోకి పూర్ణకుంభంతో అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. రాజ రాజేశ్వర స్వామికి పీఠాధిపతి అభిషేక పూజలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతి రాజ రాజేశ్వరీదేవికి పూజలు చేశారు. అలాగే ఆలయ ఆవరణలోని శ్రీ వీరభద్రేశ్వర, శ్రీ విఠలేశ్వర, శ్రీ నరసింహస్వామి, శ్రీ కాశీ విశ్వేశ్వర సహిత ఆంజనేయ స్వామివారికి జగద్గురు శృంగేరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విధు శేఖర భారతి మహాస్వామి పూజలు చేశారు. అద్దాల మండపంలో పాదుక పూజ నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు, భక్తులకు ఆశీర్వచనం గావించి, రాజన్నకు ప్రీతి పాత్రమైన కోడె మొక్కును చెల్లించారు. అనంతరం ఆలయ విస్తరణ పనులను పరిశీలించారు. అక్కడి నుంచి భీమేశ్వరాలయం సమీపంలోని శంకర మఠం ఆవరణలో హెూమం నిర్వహించి, కలశ స్థాపన పూజలు స్వామివారు గావించారు. శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఓపెన్ స్లాబ్ లో భక్తులకు ఆశీర్వచనం గావించారు. ధర్మ విజయ యాత్రలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్, ఎస్పీ మహేష్ బి గితే, ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, ఆర్డీవో రాధాబాయి, ఆలయ ఈఓ రమాదేవి, తహసిల్దార్ విజయ్ ప్రకాశ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# 42% బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ మోసం..

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

42% బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని ఆరోపిస్తూ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యలపై బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ మేరకు ఆయన సిరిసిల్లలో మీడియా సమావేశం నిర్వహించారు.

42% బీసీ రిజర్వేషన్లకు మద్దతుగా బీజేపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో తమ ఆమోదం ప్రకటించారని గోపి స్పష్టం చేశారు. బంద్‌కు ఒకరోజు ముందు డీసీసీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలను గోపి ఖండించారు. బీజేపీ ఈ బిల్లును అడ్డుకుంటుందని ఆది శ్రీనివాస్ మాట్లాడటం అవాస్తవం అన్నారు. తమ ఎంపీ బండి సంజయ్ 42% రిజర్వేషన్‌లో కేవలం బీసీలు మాత్రమే ఉండాలని, ముస్లింలను బీసీలలో చేర్చవద్దని తన అభిప్రాయాన్ని ఇదివరకే స్పష్టం చేశారని గుర్తుచేశారు. కోర్టు "ఈ బిల్లు చెల్లదు, పాత పద్ధతిలోనే ఎన్నికలు జరపండి" అని మొట్టికాయ వేస్తే, ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు



ఎవరిపై సమ్మె చేస్తున్నారని గోపి ప్రశ్నించారు. "కోర్టు పైన చేస్తున్నారా? లేక రాజ్యాంగం ప్రకారం జీవో ఎలా ఇవ్వాలో తెలియని రేవంత్ రెడ్డి పైన చేస్తున్నారా?" అని సూటిగా అడిగారు.

కాంగ్రెస్ చెప్తున్న రిజర్వేషన్ ప్రకారం మంత్రివర్గంలో 8 మంది బీసీలు మంత్రులుగా ఉండాలి, కానీ ఎంతమంది ఉన్నారని ప్రశ్నించారు. మిగిలిన మంత్రుల స్థానాల కోసం ఆది శ్రీనివాస్ రేవంత్ రెడ్డి ఇంటి ముందు ధర్నా చేయగలరా అని సవాలు విసిరారు. "కడుపులో తలకాయ పెట్టి కాళ్ళు మొక్కడం తప్ప మీతో ఏమవుతుంది" అని ఘాటుగా విమర్శించారు. బీసీ విద్యార్థులకు రావాల్సిన ?8000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ఎందుకు ఆపారు? బీసీలను మోసం చేయడం ఆపేసి, చిత్తశుద్ధి ఉంటే విద్యార్థులకి డబ్బులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఒక బీసీ మహిళా మంత్రి అయిన కొండా సురేఖ ఇంటిపైకి పోలీసులను పంపడాన్ని ప్రభుత్వ విప్, బీసీ నాయకుడైన మీరు సమర్థిస్తున్నారా లేక స్వాగతిస్తున్నారా అని సూటిగా ప్రశ్నించారు. 42%కి 42 శాతం రిజర్వేషన్ కేవలం బీసీలకు మాత్రమే ఇస్తే, దాన్ని ప్రధానమంత్రి ని కలిపి ఆమోదింపజేసే బాధ్యత తాను తీసుకుంటానని బండి సంజయ్ ఎప్పుడో చెప్పారని, కానీ అలా బిల్లు తీసుకువచ్చే ధైర్యం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందా అని గోపి ప్రశ్నించారు. "అమలు కానీ 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తూ వచ్చారు" అని పేర్కొంటూ, ఈ బిల్లు చెల్లదని కోర్టు కొట్టేస్తే ఇప్పుడు చేస్తున్న ఉద్యమం ఎవరిపైననో కాంగ్రెస్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. భారతీయ జనతా పార్టీ సంధించిన ప్రశ్నలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమాధానం చెప్పాలని రెడ్డబోయిన గోపి కోరారు.

# ఎమ్మెల్యే చిత్రపటానికి మహిళా సంఘ సభ్యుల క్షిరాభిషేకం

**బలగం టీవీ, ఇల్లంతకుంట**



వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నిర్వహణ కొరకు గాలి పెల్లి సొసైటీ నుండి తాళ్లపల్లి మహిళా సంఘానికి ఇప్పించిన మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చిత్రపటానికి తాళ్ల పెల్లి మహిళా సంఘం మహిళలు పాలాభిషేకం చేశారు. సోమవారం ఇల్లంతకుంట మండల కేంద్రంలో తాళ్ల పెల్లి ఓం సాయి మహిళా గ్రామైక్య సంఘం సభ్యులు, వివో సభ్యులు ఎమ్మెల్యే కవ్వంపల్లి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.

ఈ సందర్భంగా తాళ్లపల్లి మహిళా మండలి సభ్యులు మాట్లాడుతూ.. తాము నిర్వహించాల్సిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గాలి పెల్లి సొసైటీ వారు తీసుకోవడంతో తాము ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణ ని కలవగా అందుకు స్పందించిన ఎమ్మెల్యే మహిళలే నిర్వహించాలన్న ఉద్దేశంతో తాళ్ల పెల్లి ఓం సాయి గ్రామైక్య సంఘానికి వరి ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహణను ఇప్పించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా తాళ్ల పెల్లి ఓం సాయి గ్రామైక్య సంఘం మరియు వివో సంఘం మహిళా సభ్యులందరం కలిసి కృతజ్ఞతగా ఎమ్మెల్యే కవంపల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సింగిరెడ్డి మాధవి, ఉపాధ్యక్షులు ఎలుక ఇందిరా, కార్యదర్శి ఎలుక బాలమని, సహాయ కార్యదర్శి బట్టు సంతోష, కోశాధికారి అబ్బు ఉమా, మండల కాంగ్రెస్ నాయకులు ఎలుక రామస్వామి, ఏఎంసి డైరెక్టర్ తిరుపతి గౌడ్, కాంగ్రెస్ నాయకులు బోడ కమలాకర్ రెడ్డి, మాడుగుల మహేందర్ రెడ్డి, గుర్రం ఆదిరెడ్డి, జేరిపోతు చంద్రయ్య, సింగిరెడ్డి అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప మహాపాదం చేసిన అయ్యప్ప భక్తుడికి ఘన స్వాగతం..

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట గ్రామానికి చెందిన అయ్యప్ప స్వామి అంతటి రామచంద్రం ముస్తాబాద్ గురుస్వామి రాజు వారి ఆధ్వర్యంలో 60 రోజుల క్రితం ప్రారంభమైన అయ్యప్ప స్వామి మహా పాదయాత్ర విజయవంతంగా ముగిసింది. ఈ యాత్రలో భాగంగా మొత్తం 1400 కిలోమీటర్లు శబరిమల నడిచి స్వామివారి దర్శనం పూర్తి చేసుకొని సోమవారం రోజున తిరిగి స్వగ్రామానికి చేరుకున్న నేపథ్యంలో అయ్యప్ప భక్తుడు అంతటి రామచంద్రం కు గ్రామ ప్రజలు, అయ్యప్ప భక్తులు ఘన స్వాగతం పలికారు. గ్రామ ప్రవేశద్వారం వద్ద పూలమాలలు, శాలువాలతో గ్రామస్తులు, అయ్యప్ప సేవా సంఘ సభ్యులు సన్మానించి ఆయనను సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు మాట్లాడుతూ, "స్వామి భక్తుడి నిబద్ధత అందరికీ ఆదర్శం" అని పేర్కొన్నారు. గ్రామ యువత, పెద్దలు, మహిళలు పాల్గొన్న ఈ కార్యక్రమం భక్తి పరవశ వాతావరణంలో సాగింది. స్వామి సన్నిధిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తులు ఈ సందర్భంగా "అదే పవిత్ర నిష్టతో అయ్యప్ప




మాలధారణ చేస్తే ఎప్పుడూ అయ్యప్ప ఆశీర్వాదం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్రోజు గోపాల్ చారి, ఈదుల రవీందర్ రెడ్డి, మంద చక్రదర్ రెడ్డి, కట్ట ఎల్లా రెడ్డి, ముంజ భూపతి, ఎర్రోజు సత్యం, కొట్టె వెంకన్న, నాగసముద్రాల కృష్ణ, కర్ణాకర్ రెడ్డి, యాదన్న, జింకే రవి, కొయ్యడ రాజయ్య, గోడుగు హరి, శ్రీనివాస్, కొయ్యడ భాస్కర్, మెట్ట రాములు, రమేష్, బాల గౌడ్, రవి తేజ, భాను, రవి, రాజు, ప్రశాంత్, శేఖర్, అంజి, శ్రీనివాస్, రాకేష్, మహేష్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా దీపావళి సంబరాలు..

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**



మండల కేంద్రంలోని మాజీ జెడ్పీటీసీ చీటీ లక్ష్మణరావు పార్టీ కార్యాలయంలో దీపావళి పండుగ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయం ప్రాంగణంలో నాయకులు, కార్యకర్తలు టపాసులు పేల్చి పండుగ వాతావరణాన్ని ఉత్సాహభరితం చేశారు. అనంతరం వారు ఒకరికొకరు దీపావళి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సంబరాలలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని పండుగ ఉత్సాహాన్ని మరింతగా పెంచారు. ఈ సందర్భంగా చీటీ లక్ష్మణరావు అందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

# భారత్‌కు ఆసియా కప్ అందజేయాలి

- బీసీసీఐ

**బలగం టీవీ, హైదరాబాద్**

ఆసియా కప్ విజేతగా నిలిచిన భారత జట్టుకు ఇప్పటికీ ట్రోఫీ అందకపోవడం వివాదాస్పదంగా మారింది. ఈ నేపథ్యంలో ట్రోఫీని భారత్‌కు అప్పగించాలని బీసీసీఐ అధికారిక లేఖ రాసింది. ఈ విషయం గురించి బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు. "ఏసీసీ అధ్యక్షుడు నఖ్వీ నుంచి స్పందన కోసం ఎదురు చూస్తున్నాం. స్పందించకపోతే ఈ అంశాన్ని ఐసీసీ దృష్టికి తీసుకెళ్తాం. నిబంధనల ప్రకారం ముందుకు వెళ్తాం" అని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆసియా కప్ ట్రోఫీ దుబాయ్‌లోని ఏసీసీ కార్యాలయంలో ఉందని సమాచారం.

గత నెల పాకిస్థాన్‌తో జరిగిన ఆసియా కప్ ఫైనల్‌లో భారత్ విజయం సాధించిన తర్వాత దుబాయ్ స్టేడియంలో అనూహ్య సంఘటనలు చోటుచేసుకున్నాయి. సాంప్రదాయంగా ఏసీసీ అధ్యక్షుడే ట్రోఫీని అందజేయడం ఆనవాయితీ. కానీ పహల్గాం ఉగ్రదాడి అనంతర ఉద్రిక్తతల నేపథ్యంలో భారత ఆటగాళ్లు పాకిస్థాన్‌కు చెందిన ఏసీసీ ఛైర్మన్ నఖ్వీ నుంచి ట్రోఫీ స్వీకరించడానికి నిరాకరించినట్లు తెలిసింది. దీంతో ట్రోఫీ ప్రదానం వాయిదా పడింది. మొదట ఎమిరేట్స్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ ఖాలిద్ అల్ జరూని చేతుల మీదుగా ట్రోఫీ ఇవ్వాలని భావించినా, చివరికి ఆ కార్యక్రమం కూడా జరగలేదు. ఫలితంగా నఖ్వీ ట్రోఫీతో పాటు భారత ఆటగాళ్లకు దక్కాల్సిన విజేత పతకాలను కూడా తనతో తీసుకెళ్లిపోయాడు.

ఈ ఘటనపై బీసీసీఐ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇటీవల జరిగిన ఆసియా క్రికెట్ కౌన్సిల్ వార్షిక సమావేశంలో ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా నఖ్వీని నిలదీశారు. "ట్రోఫీ ఏసీసీ సొత్తు, నఖ్వీది కాదు. కప్పును భారత్‌కు సరైన పద్ధతిలో అందజేయాలి," అని రాజీవ్ శుక్లా స్పష్టం చేశారు. బీసీసీఐ నవంబర్‌లో జరగబోయే ఐసీసీ సమావేశంలో అధికారికంగా ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైంది.

తన నుంచి ట్రోఫీ స్వీకరించబోమని భారత జట్టు ఎటువంటి లిఖితపూర్వక సమాచారం ఇవ్వలేదని ఏసీసీ ఛైర్మన్ నఖ్వీ పేర్కొన్నారు. "ట్రోఫీని ఏసీసీ కార్యాలయంలో ఉంచాం. భారత జట్టు వస్తే నేను స్వయంగా అందజేస్తాను," అని ఆయన అన్నారు. బీసీసీఐతో సమావేశంలో తాను క్షమాపణ చెప్పినట్లుగా వచ్చిన వార్తలను ఆయన తోసిపుచ్చారు.

# బాహుబలి: ది ఎపిక్' ఐమాక్స్ ట్రైలర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**




దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి విజువల్ మాయాజాలం చూపించిన సూపర్‌హిట్ చిత్రం 'బాహుబలి: ది ఎపిక్' అక్టోబర్ 31న రీ-రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ తాజాగా ఐమాక్స్ వెర్షన్ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈ రీ-రిలీజ్ కేవలం పాత సినిమాను మళ్లీ చూపించడం మాత్రమే కాదు. ఐమాక్స్ , 4 డీఎక్స్, డాల్బీ సినిమా వంటి అత్యాధునిక ఫార్మాట్లలో రీమాస్టర్డ్ పిక్చర్ మరియు సౌండ్ క్వాలిటీతో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చి, సరికొత్త అనుభూతిని ఇవ్వనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. సింగిల్ వెర్షన్‌గా సినిమా నిడివి దాదాపు 3 గంటల 44 నిమిషాలు గా ఖరారు కాగా, ఇటీవలే సెన్సార్ పూర్తి చేసుకున్నది. పదేళ్ల తర్వాత బాహుబలి మాయాజాలాన్ని బిగ్ స్క్రీన్‌లో, ప్రీమియం ఫార్మాట్లలో ఆస్వాదించడానికి ప్రేక్షకుల్లో భారీ ఉత్సాహం నెలకొంది. ట్రైలర్‌లో అద్భుత విజువల్స్, యాక్షన్ సన్నివేశాలు, మరియు రీమాస్టర్డ్ సౌండ్ క్వాలిటీ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ప్రేక్షకులు బాహుబలిని మళ్లీ పెద్ద తెరపై చూడటానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# మైసా'లో రష్మికతో మరోసారి తారక్ పొన్నప్ప

**బలగం టీవీ, హైదరాబాద్**

'కేజీఎఫ్', 'పుష్ప 2' చిత్రాలతో దేశవ్యాప్తంగా పేరు తెచ్చుకున్న కన్నడ నటుడు తారక్ పొన్నప్ప ఇప్పుడు మరో పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లో కనిపించబోతున్నారు. ఈసారి రష్మిక మందన్నా హీరోయిన్గా నటిస్తున్న 'మైసా' చిత్రంలో ఆయన ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. దీపావళి సందర్భంగా విడుదల చేసిన 'మైసా' స్పెషల్ పోస్టర్‌లో తారక్ పొన్నప్ప తన పాత్రను అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమాలో భాగం కావడం ఆనందంగా ఉందని, ప్రేక్షకులు తన కొత్త షేడ్స్‌ను చూడబోతున్నారని ఆయన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తెలిపారు.

'పుష్ప 2'లో విలన్‌గా కనిపించిన తారక్ పొన్నప్ప తన స్టన్నింగ్ పర్ఫార్మెన్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఆ సినిమా తర్వాత ఆయనకు బ్యాక్ టు బ్యాక్ ఆఫర్లు వరుసగా వస్తున్నాయి. ఇప్పుడు రష్మిక మందన్నాతో రెండోసారి తెరపై కనిపించబోతుండటంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. 'మైసా' సినిమాతో రవీంద్ర పుల్లే దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నారు. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ సినిమా షఉటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది. తాజా పోస్టర్‌లో రష్మిక మందన్నా అగ్రెసివ్ లుక్‌లో కనిపిస్తూ గూస్‌బంప్స్ తెప్పించారు. 'శ్రీవల్లి'గా డీగ్లామరస్ పాత్రలో మెప్పించిన రష్మికను ఈసారి మాస్ అవతారంలో చూపించబోతున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి.

# నేను సన్యాసం తీసుకునే అవకాశం ఉంది :రేణూ దేశాయ్


**బలగం టీవీ, హైదరాబాద్**


రెండు దశాబ్దల తర్వాత రవితేజ నటించిన 'టైగర్ నాగేశ్వరరావు' చిత్రంతో నటిగా రీఎంట్రీ ఇచ్చారు రేణూ దేశాయ్. ఈ సినిమాలో ఆమె సంఘ సంస్కర్త హేమలతా లవణం పాత్రలో కనిపించారు. సినిమా సమయంలో తనపై తీవ్ర విమర్శలు వచ్చాయని రేణూ దేశాయ్ తాజా ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. "కమ్‌బ్యాక్ ఇచ్చింది కాబట్టి అన్ని సినిమాల్లో నటిస్తానని, ఎక్కడ చూసినా కనిపిస్తానని కొందరు రాశారు. కానీ సినిమా విడుదలకు రెండేళ్లు అయ్యాయి. ఇప్పటివరకు నేను మరే సినిమాలోనూ నటించలేదు. నాడు విమర్శించిన వారు ఇప్పుడు క్షమాపణ చెప్పరు కదా?" "నేను డబ్బుకు ప్రాధాన్యం ఇచ్చే మనిషిలా కనిపిస్తానేమో. డబ్బును జాగ్రత్తగా ఖర్చు చేస్తాను కానీ, దానికి అంత ప్రాధాన్యం ఇవ్వను. నటనను కెరీర్‌గా కొనసాగించినపక్షంలో మంచి పేరు సంపాదించేది" అని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం మహిళా ప్రాధాన్యం ఉన్న పాత్రలు వస్తున్నాయని, త్వరలో ఓ కామెడీ సినిమాలో అత్త పాత్రలో నటించబోతున్నట్లు రేణూ తెలిపారు. "అత్తాకోడళ్ల మధ్య హాస్యభరితంగా సాగే ఈ సినిమా త్వరలో ప్రారంభం కానుంది. భవిష్యత్తులో సన్యాసం తీసుకునే అవకాశం కూడా ఉంది. ఆధ్యాత్మిక మార్గంపై ఆసక్తి ఎక్కువ" అని పేర్కొన్నారు.

# దీపావళికి పలు సినిమాల పోస్టర్లు..

**దీపావళి పండుగ సందర్భంగా పలు నిర్మాణ సంస్థలు కొత్త సినిమా పోస్టర్‌లను పంచుకున్నాయి. అయితే ఆ పోస్టర్‌లేంటో ఒకసారి చూద్దాం.**




































## ఉగాది కానుకగా నాగబంధం

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రొడ్యూసర్ కమ్ డైరెక్టర్ అభిషేక్ నామా తెరకెక్కిస్తున్న సినిమా నాగబంధం (. పద్మనాభస్వామి, పూరీ జగన్నాథ్ ఆలయాల్లో గుప్త నిధుల ఆవిష్కరణలను స్ఫూర్తిగా అడ్వెంచరస్ మైథలాజికల్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతోంది.పాన్ ఇండియా బ్యాక్ డ్రాప్ స్టోరీ నేపథ్యంలో వస్తోన్న ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్తను షేర్ చేశారు మేకర్స్. నాగబంధం చిత్రాన్ని 2026 మార్చి 19న ఉగాది కానుకగా విడుదల చేయాలని ఫిక్స్ అయ్యారని సమాచారం. దీనికి సంబంధించి త్వరలోనే అధికారిక ప్రకటన కూడా చేయబోతున్నారట. పెదకాపు సినిమాతో హీరోగా ఎంట్రీ ఇచ్చిన విరాట్ కర్ణ ఈ చిత్రంలో లీడ్ రోల్‌లో నటిస్తున్నాడు. ఇస్మార్ట్ భామ నభానటేశ్, ఐశ్వర్య మీనన్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. అభిషేక్ పిక్చర్స్, నిక్ స్టూడియోస్, తారక్ సినిమాస్ బ్యానర్లపై అభిషేక్ నామా, కిశోర్ అన్నపురెడ్డి, లక్ష్మి ఐరా సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

## సీనియర్ నటుడు, దర్శకుడు గోవర్ధన్ అస్రాని కన్నుమూత

**బలగం టీవీ, హైదరాబాద్**



బాలీవుడ్ సీనియర్ నటుడు, దర్శకుడు గోవర్ధన్ అస్రాని వయసు 84 సంవత్సరాల్లో మృతి చెందారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న అస్రానిని కుటుంబ సభ్యులు నాలుగు రోజుల క్రితం ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. సినీ రంగంలో అస్రాని మృతి పట్ల పలువురు ప్రముఖులు, సహచరులు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా సంతాపం వ్యక్తం చేస్తున్నారు. 1941లో రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్ లో జన్మించిన అస్రాని, ప్రారంభంలో ఆల్ ఇండియా రేడియోలో వాయిస్ ఆర్టిస్ట్గా పనిచేశారు. నటనపై ఆసక్తి ఉన్న అస్రాని 1962లో ముంబైకు వెళ్లి, ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్, పుణేలో ప్రవేశపడ్డారు. 1966లో "హమ్ కహా జా రహే హై" సినిమాలో వెండితెరపై అడుగుపెట్టారు. 1967లో "హరే కాంచ్ కీ చూడియా"తో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. "షోలే" సినిమాలోని జైలర్ పాత్ర ఆయనకు విశేషమైన పేరు తెచ్చిపెట్టింది. సుదీర్ఘ సినీ ప్రస్థానంలో అస్రాని 350 కంటే ఎక్కువ సినిమాల్లో నటించి, ప్రేక్షకులను అలరించారు. "హీరో హిందుస్థానీ", "డ్రీమ్ గర్ల్ 2" వంటి చిత్రాల్లో కూడా గుర్తుండిపోయే పాత్రలు పోషించారు. అంతేకాకుండా "చలా మురారీ హీరో బన్నే", "ఉడాన్" వంటి సినిమాలకు దర్శకత్వం వహించి ప్రతిభను చాటుకున్నారు.

## నేడు ఐకెపి అండ్ పీఏసీఎస్ సెంటర్ల ప్రారంభోత్సవ కార్యక్రమం

**బలగం, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో తేదీ: 22-10-2025 బుధవారం రోజున సాయంత్రం 4.00 తడగొండ పిఎసిఎస్,4.30 కోరెం ఐకెపి,5.00 బోయినిపల్లి పిఎసిఎస్, 5.30 మర్లపేట పిఎసిఎస్, 6.00 విలాసాగర్ పిఎసిఎస్,6.30 కొదురుపాక పిఎసిఎస్, రాత్రిబి 7.00 మానువాడ పిఎసిఎస్ గ్రామాలలో చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం ఐ.కె.పి అండ్ పి.ఎ.సి.ఎస్ సెంటర్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రారంభిస్థారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి తెలిపారు.

## పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

**బలగం, బోయినిపల్లి**

1959 అక్టోబరు 21న డీఎస్పీ కరమ్ సింగ్ నేతృత్వంలో పంజాబ్ కు చెందిన 21 మంది సభ్యుల బృందం సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తుండగా, చైనా రక్షణ బలగాలు సియాచెన్ భూభాగాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించడంతో సీఆర్పీఎఫ్ దళం హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో దీటుగా ఎదురొడ్డి పోరాడింది.ఆ పోరాటంలో పది మంది భారత జవాన్లు ప్రాణాలను కోల్పోయారు. హాట్ స్ప్రింగ్స్ అంటే వేడి నీటిబుగ్గ అని అర్థం. కానీ భారత జవాన్ల రక్తంతో తడిచిన హాట్ స్ప్రింగ్స్ నెత్తుటి బుగ్గగా మారి పవిత్రస్థలంగా రూపు దిద్దుకుంది. ప్రతి ఏడాదీ అన్ని రాష్ట్రాల పోలీసులతో కూడిన బృందం ఈ పవిత్ర స్థలాన్ని సందర్శించి నివాళులు అర్పించడం ఆనవాయితీ.

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురామ్ మాట్లాడుతూ: విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు మరువలేము అని,వారిని స్మరించుకోవడం అందరి బాధ్యత. నేర పరిశోధన, ప్రజల సంరక్షణలో పోలీసుల సేవలు అజరామమం. మన కళ్ల ముందు నిత్యం ఏ కష్టం కలిగినా ముందుగా గుర్తొచ్చేది పోలీసు,ఖాకి డ్రేస్ ఖరుకుదనం వెనుకాల ఉన్నది మనిషే కాబట్టి వారందరికీ మర్యాద, గౌరవం, విలువ ఇవ్వాల్సిన అవసరం ఉంది.నిత్యం పోలీసులు చేస్తున్న పోరాటాలు, వీరోచిత సాహస చర్యలను మనం చూస్తున్నాం. వీరందరూ తమ కుటుంబాన్ని, వ్యక్తిగత జీవితాలను త్యాగం చేసి, దేశంలోని కోట్లాది మంది ప్రజల కోసం , ఉద్యోగ నిర్వహణలో జీవితాలు అంకిత చేసిన వారందరికీ పాదాభివందనం.అసువులు బాసిన భరతమాత ముద్దు బిడ్డలందరికీ జోహార్లు, ప్రపంచమంతా నిద్రలో ఉంటే పోలీసులు మేల్కొని శాంతిభద్రతల పరిరక్షణ కోసం కాపలా ఉంటారు. ఎండా, వాన, పగలు, రాత్రి అని తేడా లేకుండా, కుటుంబంతో కలిసి జరుపుకునే పండుగ,పబ్బాల్ని కూడా త్యజించి ప్రజల కోసం జీవించి, మరణించే పోలీసులకు, అందునా ప్రాణాలని ఫణంగా పెట్టి,ప్రజల కోసం పోలీసులు చేసిన త్యాగానికి సానుభూతి, గౌరవం చూపించడం మనందరి బాధ్యత.భవిష్యత్‌లో పోలీసులుగా బాధ్యత నిర్వర్తించడానికి ముందుకురాబోతున్న వారికి విధి నిర్వహణలో నూతనోత్తేజాన్ని, స్ఫూర్తిని నింపడం కోసమే పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకోవడం ప్రధాన ఉద్దేశం అని పేర్కొన్నారు.

## ఢిల్లీలో కమ్మేసిన వాయు కాలుష్యం

**బలగం, న్యూఢిల్లీ**

దేశ రాజధాని ఢిల్లీని వాయు కాలుష్యం కమ్మేసింది. వారం రోజులుగా ప్రమాదకర స్థాయిలో వాయుకాలుష్యం కొనసాగుతోంది. దీపావళి వేడుకల తర్వాత అది మరింత ప్రమాదకర స్థాయికి చేరింది. మంగళవారం ఉదయం ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్(ఏక్యూఐ) 451 పాయింట్లతో నమోదైంది. ఎన్సీఆర్ పరిధిలో మొత్తం 38 ఎయిర్ మానిటరింగ్ స్టేషన్లు ఉండగా... దాదాపు 36 పాయింట్లలో వెరీ పూర్ కేటగిరితో రెడ్‌జోన్‌ను చూపించాయి. వజీర్‌పూర్ 423, ద్వారకా 417, అశోక్‌విహార్ 404, ఆనంద్ విహార్‌లో 404 ఏక్యూఐ నమోదైంది. అలాగే పటేల్‌నగర్, జహంగీర్‌పురి, బురారి వంటి ప్రాంతాల్లో ఏక్యూఐ 480 దాటినట్టు వెల్లడైంది. ఇది దేశ సగటు కంటే దాదాపు 1.8 రెట్లు ఎక్కువని అధికారులు తెలిపారు. అలాగే యునెస్కో, డబ్ల్యూహెచ్ఓ రికార్డుల ప్రకారం... ఏకంగా 15 రెట్లు ఎక్కువని నిపుణులు తెలిపారు. అయితే ఇది చాలా ప్రమాదకరమని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి(సీబీసీబీ) పేర్కొంది. బుధవారం వరకు ఇదే పరిస్థితి ఉంటుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. అందువల్ల అత్యావ సర పరిస్థితుల్లోనే ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రావాలని సూచించారు. కాలుష్యం పెరగడంలో కళ్లు, ముక్కు, గొంతులో మంట, దురద సమస్యలు తలెత్తే అవకాశముందని, తప్పనిసరిగా మాస్కులు ధరించాలని వైద్యులు సూచిస్తున్నారు.

గతేడాది దీపావళి మరుసటి రోజు ఉదయం ఏక్యూఐ 296 పాయింట్లుగా నమోదు కాగా.. ఈసారి దీపావళి పండుగ రోజు సాయంత్రానికే ఎయిర్ క్వాలిటీ దారుణంగా పడిపోయింది. ఇందుకు బాణాసంచా కాల్చడమే ప్రధాన కారణమని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ఎన్సీఆర్ పరిధిలో బాణాసంచా కాల్చడంపై ఇటీవల సుప్రీంకోర్టు నిషేధం విధించింది. అయితే... కొత్తగా ఢిల్లీలో అధికారంలోకి వచ్చిన బీజేపీ సర్కార్ విజ్ఞప్తితో ఈసారి గ్రీన్ క్రాకర్స్ కాల్చుకునేందుకు అక్టోబర్ 15న సుప్రీంకోర్టు షరతులతో కూడిన అనుమతిని ఇచ్చింది.

అయితే... ఈ గ్రీన్ క్రాకర్స్ పేరుతో మార్కెట్లో ఎక్స్‌పయర్స్ డేట్, నాణ్యత లేని బాణాసంచా అమ్మకాలు విచ్చలవిడిగా జరిగాయి. ఫలితంగా బాణాసంచా సౌండ్స్ కన్నా... పొల్యూషన్ భారీగా పెరిగింది. అలాగే ఢిల్లీవాసులు సైతం భారీగా బాణాసంచాను కొనుగోలు చేశారు. రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకే టపా సులు కాల్చుకునేందుకు కోర్టు అనుమతివ్వగా... అర్ధరాత్రి వరకు బాణాసంచా కాల్చారు. దీనికి వాతావరణ మార్పులు తోడవడంతో కాలుష్య కారకాలు అలాగే అంటి పెట్టుకొని గాలి తేమతో కలిసిపోయాయి.

ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్ కాస్టింగ్ అండ్ రీసెర్చ్ ప్రకారం... ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ)లో స్థానిక ప్రాంతంలోని గాలి నాణ్యతలను తెలుసుకోవచ్చు. ఏక్యూఐ 0-100 శాతం మధ్య ఉంటే గాలి నాణ్యత బాగా ఉండి కాలుష్యం లేదని అర్థం. అదే 100 - 200 శాతం ఉంటే గాలి నాణ్యత మధ్యస్థంగా ఉందని, ఇక 200-300 శాతం మధ్య ఉంటే అధ్వానంగా ఉందని, 300 - 400 ఉంటే గాలి నాణ్యత మరింత అధ్వానంగా ఉన్నట్టు. ఇక 400-500 శాతం మధ్య ఉంటే కాలుష్యం తీవ్ర స్థాయిలో ఉన్నట్లు లెక్క.

ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో పెరిగిన కాలుష్యంతో సర్కార్ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. గ్రేడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జీఆర్‌ఏపీ) రెండో దశను అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం... నిర్మాణ పనులపై పరిమితులు విధించింది. తద్వారా నిర్మాణ సైట్స్ నుంచి వచ్చే దుమ్ము, ధూళిని కంట్రోల్ చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే డీజిల్ జనరేటర్ల వినియోగంపై నిషేధం పెట్టింది. ప్రయివేట్ వాహనాలను కంట్రోల్ చేసేలా... ఎలక్ట్రిక్ బస్సులు, మెట్రో రైళ్ళ సేవలు పెంచింది. స్టూడెంట్స్, ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే పిల్లల కోసం ఆన్‌లైన్ క్లాసులు పెట్టే పరిశీలన చేస్తోంది. వీటితో పాటు రోడ్లపై నీటి స్ప్రేలు, యాంటీ-స్మాగ్ గన్స్ వినియోగం పెంచాలని నిర్ణయించినట్టు అధికారులు తెలిపారు.

## పోలీసు అమర వీరుల త్యాగం మరువలేనిది

**ఇల్లంతకుంట ఎస్ఐ సిరిసిల్ల అశోక్**

**బలగం, టీవీ ఇల్లంతకుంట**



పోలీసు అమర వీరుల త్యాగం మరువలేనిదని, వారి ప్రాణాలు వెల కట్టలేనివని ఇల్లంతకుంట ఎస్సై సిరిసిల్ల అశోక్ కుమార్, రెండవ ఎస్ఐ లక్పతి అన్నారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకొని , కొవ్వొత్తులతో యువతతో ,కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ నుండి వివేకానంద విగ్రహం, మీదుగా బస్టాండ్ వరకు వెళ్లి, పోలీస్ అమరవీరుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమరవీరులకు జోహార్లను అర్పించారు. కొవ్వొత్తులను బస్టాండ్ ఆవరణలో ఉంచి, పోలీస్ అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, కానిస్టేబుళ్లు అనిల్, ఆర్ సురేష్, హెూంగార్డ్ వెంకటేశం, తో పాటుగా, ఇల్లంతకుంట గ్రామ యువత,తో పాటుగా ఆయా గ్రామాల చెందిన యువకులు, గ్రామస్తులు పలువురు, పాల్గొన్నారు.

### లేబర్ వెల్ఫేర్ సంక్షేమ బోర్డును

## ప్రయివేట్ ఇన్సూరెన్స్ కంపెనీ అప్పజెప్పడాన్ని వెనక్కు తీసుకోవాలి



- **భవన నిర్మాణ కార్మికులకు రక్త పరీక్ష పేరిట కార్యక్రమాన్ని నిలుపుదల చేయాలి**
- **భవన నిర్మాణరంగం యూనియన్ సీఐటీయూ డిమాండ్**

**బలగం, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో పత్రికా ముఖంగా భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో ఈ మధ్యకాలంలో లేబర్ కార్డులు ఉన్న ప్రతి భవన నిర్మాణ రంగం కార్మికులకు రక్త పరీక్షల పేరిట కార్మికుల ఇండ్ల వద్దకు వెళ్లి రక్తం తీసుకుంటూ హెల్త్ చెకప్ పేరిట కార్మికులను అమాయకులను చేసి, దగా చేస్తున్న తీరును జిల్లా భవన నిర్మాణ సంఘం యూనియన్ సిఐటియు పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా భవన నిర్మాణ రంగం యూనియన్ సిఐటియు ఉపాధ్యక్షులు గురజాల శ్రీధర్ అన్నారు.

ఈ సందర్భంగా గురజాల శ్రీధర్ మాట్లాడుతూ: లేబర్ కార్డు కలిగిన ప్రతి కార్మికుడు, కార్మికురాలు రక్తపరీక్షలు చేసుకోవద్దని, రక్త పరీక్ష పేరిట కార్యక్రమం నిలుపుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర లేబరు సంక్షేమ బోర్డు కార్యాలయాన్ని డిమాండ్ చేయడం జరుగుతుందని అన్నారు.ఇప్పటికే లేబర్ వెల్ఫేర్ సంక్షేమ బోర్డు ద్వారా భవన నిర్మాణ రంగం కార్మికులకు చెందాల్సిన కోట్ల రూపాయలను, సొమ్మును కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బోర్డు నుంచి లాగేసుకోవడం జరిగింది అని అన్నారు.భవన నిర్మాణ కార్మికులకు చెందాల్సిన క్లైములు సకాలంలో చెల్లించకపోవడం వల్ల, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.అలాగే రెన్యువల్ చేసుకున్న కూడా రెన్యువల్ ఇంప్రూవ్మెంట్ కాకపోవడం వల్ల కార్మికులు బెనిఫిట్,కోల్పోతున్నారు. జిల్లా లేబర్ ఆఫీసర్ సానుకూలంగా స్పందిస్తున్నప్పటికీ,రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ సంక్షేమ బోర్డుఅధికారులు నిర్లక్ష్యం మూలంగా భవనం నిర్మాణ రంగం కార్మికులు తీవ్రంగా నష్ట పోతున్నారు. సకాలంలో సహజ మరణం క్లైములు, యాక్సిడెంట్ క్లైములు అందే విధంగా రాష్ట్ర వెల్పర్ సంక్షేమ బోర్డు కార్యాలయం దృష్టి పెట్టాలని, ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీకి అప్పజెప్పడాన్ని ప్రభుత్వం పునర్ ఆలోచించి,వెనక్కు తీసుకోవాలని, ప్రభుత్వ ఆధీనంలో నడిచే విధంగా తగు చర్యలు తీసుకోవాలని భవన నిర్మాణ రంగంయూనియన్ కార్మికుల పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామంచ అశోక్, మరియు భవన నిర్మాణ కార్మికులు అంజయ్య, లచ్చయ్య, పొత్తూరి నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.



## గ్రామ భవన నిర్మాణ సుతారి సంఘం ఏకగ్రీవ ఎన్నికలు

**బలగం, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామ భవన నిర్మాణ సుతారి సంఘం ఎన్నికలు మంగళవారం రోజున ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడిగా గజ్జెల బాబు, ఉపాధ్యక్షుడిగా దోమకొండ కిరణ్, కోశాధికారిగా బొడ్డు శంకర్ లను ఎన్నుకున్నారు. కొత్తగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ: గ్రామ అభివృద్ధి, సుతారి వృత్తి అభివృద్ధి కోసం కృషి చేస్తామని సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు,గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.